కాంగ్రెస్ సభలకు జనం రాలేదంటే ఫొటో పక్కనుంచి తీశారు.. వెనకనుంచి తీశారు, ముందు నుంచి తీశారు అని ఏవేవో కారణాలు చెప్తున్నారు. అసలు సంగతి ఏంటంటే! ఏ యాంగిల్లో చూసిన కాంగ్రెస్ సభల్లో జనం లేరు. నల్లగొండలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభే ఇందుకు నిదర్శనం.

అందుకే ఎవరికీ అనుమానాల్లేకుండా 'నమస్తే తెలంగాణ' అన్ని యాంగిల్స్ ఫొటోలు ఇస్తున్నది.

టాప్ యాంగిల్

బ్యాక్ యాంగిల్

సైడ్ యాంగిల్

ఫ్రంట్ యాంగిల్

జోగులాంబ జిల్లా అయిజలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలతో వెలవెలబోతున్న కాంగ్రెస్ సభ

ఓటర్లతో కాంగ్రెస్ పిల్లలాట!

- అదిగో పులి అంటే ఇదిగో తోకంటూ ప్రచారం
- సోషల్‌మీడియాలో తప్పుడు కథనాలు
- వారి సభల్లో జనమే పెద్దగా ఉండరు
- వచ్చిన వారి నుంచి స్పందన రాదు

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ప్రచార సభలకు పెద్దగా జనమే రావడం లేదు. వచ్చిన వారు సైతం నేతల ప్రసంగాలకు స్పందించడం లేదు. వేదికపై నుంచి నేతలే అడిగి మరీ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో నాయకులే లేకపోగా.. ఓటర్లను కదిలించడానికి కనీసం తగిన యంత్రాంగమే లేదు.. అయినప్పటికీ తామే గెలుస్తున్నట్టు ఊదరగొడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి పడరాని పాట్లు పడుతున్నది. మొత్తానికి ఆడ లేక వాకిలి వంకర అన్నట్టున్నది కాంగ్రెస్ పార్టీ వ్యవహారం. ప్రజలలో పెద్దగా ఆదరణ లేకపోయినప్పటికీ, కాంగ్రెస్సే గెలువబోతున్నట్టు హైప్ క్రియేట్ చేసేలా మైండ్‌గేమ్ ఆడుతున్నది. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్న చందంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. రోజుకో సర్వే పేరిట ఫేక్ సర్వేలతో ప్రజలను గందరగోళపరచడమే పనిగా పెట్టుకున్నది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను పెద్దఎత్తున ఎంగేజ్ చేసి తప్పుడు ప్రచారానికి తెగబడింది. ఇదంతా చూస్తున్నవారు కాంగ్రెస్‌ది 'పైన పటారం లోన లొటారం' అని వ్యాఖ్యానిస్తున్నారు. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున సాగిస్తున్న తప్పుడు ప్రచారం వల్ల బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఆయోమయానికి గురవుతున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది కూడా అదే. ప్రజలను గందరగోళానికి గురిచేసి నాలుగు ఓట్లు సంపాయించవచ్చన్నది ఆ పార్టీ వ్యూహమని తెలుస్తున్నది. ప్రచార సభలో బీఆర్ఎస్ ప్రసంగాలను తమకు అనుకూలంగా ఎడిటింగ్ చేసి వాటిని వైరల్ చేస్తున్నారు. ఎడిట్ చేసిన వీడియో క్లిప్పింగ్‌లు సోషల్ మీడియాలో అనేకం దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి ప్రముఖ సర్వే సంస్థలు కానీ, పలు జాతీయ మీడియా సంస్థలు కానీ విడుదల చేసిన నివేదికలన్నీ బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించబోతున్నట్టు వెల్లడించాయి. కానీ కాంగ్రెస్ పార్టీ గెలువబోతున్నదని ప్రచారం చేస్తున్న సంస్థలు ఊరూ పేరు లేని ఫేక్ సంస్థలే కావడం గమనార్హం.

పైన పటారం...లోన లోటారం

కాంగ్రెస్ పార్టీ తామే గెలువబోతున్నట్టు చేస్తున్న తప్పుడు ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఎన్నికల నేపథ్యంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, ఎన్నికల విశ్లేషకులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ఓ పది మందితో మాట్లాడితే ఏడుగురు వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీ తిరిగి గెలువబోతున్నదని అన్నారు. మొత్తంగా 70 నుంచి 80 శాతం మంది ఓటర్లు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటే ఇక ఏవిధంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. ఇదే విషయాన్ని క్షేత్రస్థాయికి వెళ్లవచ్చిన జర్నలిస్టులు, విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, ఆసరా, కల్యాణలక్ష్మి పథకాల లబ్ధిదారులు ప్రతి ఇంట్లో ఉన్నారు. వారంతా తాము కచ్చితంగా బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపిస్తామని బల్లగుద్ది చెప్తున్నారు. చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో పోల్ యంత్రాంగం కూడా లేదు. వాస్తవ పరిస్థితి ఈ విధంగా ఉంటే మరి కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది? సోషల్ మీడియాలో జరిగేదంతా తప్పుడు ప్రచారమేనని వారు ఖండిస్తున్నారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న పార్టీ పట్ల ప్రజలలో ఎంతో కొంత వ్యతిరేకత ఉండటం సహజం. కానీ ఆ వ్యతిరేకత ఎక్కడా కనిపించకపోగా, బీఆర్ఎస్‌కు సానుకూల పవనాలు వీయడం మాత్రం చెప్పుకోదగ్గ పరిణామంగా విశ్లేషిస్తున్నారు.

కాంగ్రెస్‌ను నమ్మడం లేదు

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదన్నది క్షేత్రస్థాయిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఐదు గ్యారెంటీల పేరిట అక్కడి ప్రజలను మోసం చేసి గెలిచి ఆ తర్వాత చేతులు ఎత్తేసిన వైనాన్ని గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజలే వివరిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ ఇస్తామంటూ ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తమ సెల్‌ఫోన్లలో సేవ్ చేసుకొని వివరిస్తుండటం మరీ విశేషం. గతంలో కాంగ్రెస్ హయాంలో విద్యుత్తు కోతలపై ధర్నాలు, ఆందోళనలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. వృద్ధులు, చేతివృత్తులవారు, బీడీ, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు సీఎం కేసీఆర్‌ను ఇంటికి పెద్దకొడుకులా చూసుకుంటున్నారని వివరిస్తుంటే, ప్రజల్లో కేసీఆర్ పట్ల ఇంతటి అభిమానం గూడుకట్టుకున్నదా? అన్న ఆశ్చర్యం వేస్తుంది. క్షేత్రస్థాయిలో, బయట జరిగే ప్రచారానికి పొంతన కుదరడంలేదు. దీనినిబట్టి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారమంతా ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ఆడుతున్న నాటకమని అనిపిస్తున్నది.

మార్పు ప్రజలు కోరడం లేదు

- పథకాలు అందలేదన్న అసంతృప్తి కొందరిలో ఉంది
- అందువల్ల అధికారం మారాలని ఎవరూ కోరడం లేదు
- గెలుపుపై కాంగ్రెస్‌ది వ్యూహాత్మక ప్రచారం మాత్రమే
- 42 శాతం బీఆర్ఎస్ ఓటర్లు సైలెంట్‌గా ఉన్నారు
- 35 శాతం కాంగ్రెస్ ఓటర్లు చెప్పుకుంటున్నారు
- రాజకీయ విశ్లేషకుడు శివకేశవ్

హైదరాబాద్, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులే మార్పు కోరుకుంటున్నారు తప్ప ప్రజలు కోరుకోవడం లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మిషన్ చాణక్య సీఈవో శివకేశవ్ చెప్పారు. కాంగ్రెస్ చెప్పున్న మార్పు అంటే.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని వెనక్కి మళ్లించటమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఆయన బుధవారం ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ..తాము గత నాలుగు నెలలుగా 114 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల నాడి తెలుసుకున్నామని చెప్పారు. జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలు తమకు అందలేదన్న అసంతృప్తి కొందరిలో ఉంది తప్ప అవి ఆగిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలుకాగానే కాంగ్రెస్ నాయకులు తమదే విజయమన్నట్టు సోషల్ మీడియాలో, మౌత్ పబ్లిసిటీ ద్వారా వ్యూహాత్మకంగా చేసిన ప్రచారం తప్ప వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని చెప్పారు. సీఎంగా కేసీఆర్ మళ్లీ రావాలని 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఆయన పాపులారిటీని కాంగ్రెస్ ఏమాత్రం తగ్గించలేకపోయిందని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్, ఆయా పథకాల లబ్ధిదారులతో కలిపి బీఆర్ఎస్‌కు సంఘటితంగా 45 శాతం మంది ప్రజల చెక్కుచెదరని బలం ఉన్నదని, దీనిని కాంగ్రెస్ ఏమాత్రం ప్రభావితం చేయలేకపోతున్నదని చెప్పారు.

ప్రజలు కొంత గందరగోళంలో ఉన్నప్పటికీ చివరికి కేసీఆర్‌కే ఓటు వేస్తామని చెప్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ మౌత్‌టాక్‌పై ఆయన స్పందిస్తూ.. 'మా సర్వేలో బీఆర్ఎస్‌కు 42 శాతం ఓట్లు దక్కితే.. కాంగ్రెస్‌కు 35 శాతం ఓట్లు దక్కాయి. బీఆర్ఎస్‌కు ఓటు వేసే వాళ్లు సైలెంట్‌గా ఉంటే.. కాంగ్రెస్‌కు ఓటు వేసే 35 శాతం మంది మాత్రం చెప్పుకుంటున్నారు. అందుకే ఆ పరిస్థితి ఏర్పడింది. అని తెలిపారు. ఇక టీడీపీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు మళ్లడం సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిందే టీడీపీ అని, అలాంటి పార్టీ ఓట్లు తన వ్యతిరేక పార్టీకి ఏ విధంగా మళ్లుతాయని ప్రశ్నించారు. ఖమ్మంలో ఎవరూ ఊహించిన ఫలితాలు ఉంటాయని, మెజార్టీ సీట్లను బీఆర్ఎస్ గెలుచుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్‌లో భట్టి విక్రమార్కను, సీతక్కను ఓడించేందుకు ఆ పార్టీ వాళ్లే ప్రయత్నం చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోనూ బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు వస్తాయని తెలిపారు. అక్కడ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడం, వలసలను కట్టడి చేయడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడం వంటివి బీఆర్ఎస్‌కు కలిసి వస్తాయని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తయితే మహబూబ్‌నగర్ సస్యశ్యామలం అవుతుందన్నారు. అందుకే కేసీఆర్ రాకపోతే పాలమూరు పూర్తి కాదు.. మళ్లీ మహబూబ్‌నగర్ పాత రోజులు వస్తాయనే ఆలోచన, ఆందోళన అక్కడి ప్రజల్లో ఉందని తెలిపారు. ఇక నల్లగొండలో కాంగ్రెస్ నాయకుల పెత్తనం పెరిగిపోయిందని, అక్కడ కోమటిరెడ్డి బ్రదర్స్ ఆగడాలకు చెక్ పెట్టాలని ప్రజలు చూస్తున్నారని తెలిపారు. నల్గొండలో ఒక నేత మరో నేతను నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

బట్టలూడదీసి.. బెల్టుతో చావబాది

రూ. 300 అప్పు తిరిగి ఇవ్వనందుకు దాష్టీకం
మహారాష్ట్ర సీఎం షిండే స్వస్థలంలో దారుణం

థానే, నవంబర్ 22: మహారాష్ట్ర ముఖ్యమంత్రి సొంత పట్టణమైన థాణేలో పట్టపగలే దారుణం జరిగింది. తమ వద్ద తీసుకున్న రూ. 300 తిరిగి చెల్లించలేదన్న కారణంతో 17 ఏళ్ల బాలుడిపై ఇద్దరు యువకులు అమానవీయంగా ప్రవర్తించారు. మిట్టమధ్యాహ్నం అందరూ చూస్తుండగా నగ్నంగా మార్చి బెల్టుతో చావబాదారు. మంగళవారం మధ్యాహ్నం థాణే శివారు కల్వా మసీదులో జరిగిందీ ఘటన. నిందితులు తౌసిఫ్ ఖాన్‌బాండే, శామిల్ ఖాన్ బాండే తొలుత బాలుడి ఇంటికి వెళ్లి తమ బ్లూటూత్ డివైజ్ చోరీ చేసినట్టు ఆరోపించారు. ఆపై తమ వద్ద తీసుకున్న రూ. 300 వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి ఆరోపణలను ఖండించిన బాలుడు.. డబ్బులు ఇచ్చేది లేదన్నాడు. దీంతో అతడిని సమీపంలోని మసీదు వద్దకు ఈడ్చుకెళ్లి కాళ్లతో తంతూ, పిడిగుద్దులు కురిపిస్తూ చిత్రహింసలకు గురిచేశారు. ఆపై అందరూ చూస్తుండగానే బాలుడి దుస్తులు విప్పి నగ్నంగా మార్చి బెల్టుతో చావబాదారు. తౌసీఫ్ బెల్టుతో బాదుతుంటే శామిల్ తీరిగ్గా వీడియో తీశాడు. చివరికి బాలుడే వారి చేతుల్లోంచి ఎలాగోలా తప్పించుకుని కల్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తొలుత పట్టించుకోని పోలీసులు వీడియో వైరల్ కావడంతో ఎఫ్ఆర్ నమోదు చేశారు.

కాంగ్రెస్ ఖేల్ ఖతం

మొదటిపేజీ తరువాయి...

కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఖర్గే వచ్చే సమయానికే జనం తిరుగుముఖం పట్టారు. ఖర్గే ప్రసంగం ప్రారంభించేందుకు వస్తుండగా ఒక్కొక్కరుగా లేచి వెళ్లిపోయారు. దీంతో సభనుంచి వెళ్లొద్దంటూ జనాలను కోమటిరెడ్డి పదే పదే బతిమిలాడుకోవాల్సి వచ్చింది. అయినా కోమటిరెడ్డి మాటలు పట్టని జనం అక్కడినుంచి జారుకోవడంతో ఖాళీ కుర్చీలను చూస్తూ ఖర్గే ప్రసంగించారు. మొత్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేవలం 2000 మంది మాత్రమే మిగలడంతో కోమటిరెడ్డి, మణిక్‌రావ్‌ఠాక్రే తలలుపట్టుకొన్నారు. జనం లేక వెలవెలబోయిన సభలో తాను ఎలా ప్రసంగించాలని అన్నారో ఏమో..ఖర్గే చేతులు పట్టుకొని కోమటిరెడ్డి బతిమిలాడటం కనిపించింది. సీఎం కేసీఆర్‌తో పోటాపోటీ అన్నట్టుగా సభ నిర్వహించాలని గొప్పలకుపోయిన కోమటిరెడ్డి రాజకీయ అహంకారంపై నల్లగొండ ప్రజలు గట్టిదెబ్బ కొట్టారు. కేసీఆర్‌లాంటి మహానాయకుడితో పెట్టుకున్నందుకు కోమటిరెడ్డి బ్రదర్స్‌కు తగిన శాస్తి జరిగిందని అక్కడున్న నాయకులే చర్చించుకోవడం కనిపించింది. కాగా, తమకు మంచి గ్రిప్ ఉన్నదని కాంగ్రెస్ నేతలు చెప్పుకొనే నల్లగొండలోనే ఇట్లా ఉంటే ఇక తెలంగాణలో వాళ్ల పరిస్థితి ఏంటో తెలిసిపోతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్ తీరుతో విసిగివేసారిన జనం

కాంగ్రెస్ చెప్పే గ్యాస్ మాటలతో తెలంగాణ ప్రజలు విసిగివేసారిపోయారు. ఆ పార్టీ నాయకులు చెప్పేవన్నీ వట్టిమాటలేనని జనం గ్రహించారు. అందుకే తెలంగాణలో జరుగుతున్న ఏ సభలకూ జనం రావడంలేదు. వచ్చినా సభ మొత్తం పూర్తవకుండానే వెనుదిరుగుతున్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో ఖర్గే సభ, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో పీసీసీ చీఫ్ రేవంత్ సభలు వెలవెలబోయాయి. అయిజలో హస్తం పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేయగా, మల్లికార్జున ఖర్గే, మణిక్‌రావుఠాకూర్‌తో పాటు విజయశాంతి హాజరయ్యారు. ఇంతమంది పెద్దలు హాజరైనా సభలో ఎక్కడ చూసినా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. నల్లగొండ సభలో జరిగిందే ఇక్కడకూడా పునరావృతమయ్యింది. ఖర్గే మాట్లాడుతుండగానే ఒక్కొక్కరుగా వెనుదిరిగారు. ఎవరూ వెళ్లొద్దని అభ్యర్థి సంపత్ మైక్‌లో మొరపెట్టుకున్నా జనం వినలేదు. అలాగే, సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి విజయభేరి ఎన్నికల సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ వచ్చిన కొద్ది సేపటికే సభా ప్రాంగణం నుంచి ప్రజలు జారుకోవడం కనిపించింది. దీంతో అసహనానికి గురైన రేవంత్ అరగంటలోపే తన పసలేని ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉండగా, హస్తం నేతలవి వట్టి గాలిమాటలేనని ఖర్గే, రేవంత్ సభల సాక్షిగా తెలంగాణ ప్రజలకు అర్థమైపోయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ మీద గెలువబోమని తెలిసికూడా కాంగ్రెస్ నేతలు దింపుడుగళ్లెం ఆశలాగా గ్యాస్ మాటలతో మైండ్‌గేమ్ ఆడుతున్నారని వారు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు.. వట్టిమాటలతో ప్రజలు విసిగి వేసారిపోయారని, ఇందుకు ఆ పార్టీ నిర్వహిస్తున్న సభల్లో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలే నిదర్శనమని వారు అంటున్నారు.